సాక్షి
తూర్పుగోదావరి

మంగళవారం । 10 । సెప్టెంబర్ । 2024



ఏడు కిలోల వెండి తులాభారం
ఆత్రేయపురం: రాజమహేంద్రవరానికి చెందిన దంపతుల సంతానమైన కవల చిన్నారుల శ్రేయస్సు కోరుతూ వాడపల్లి వెంకన్నకు ఏడు కిలోల వెండిని తులాభారం ఇచ్చారు.



అవగాహన.. అంతంత మాత్రం
జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షపై చాలా మందికి అవగాహన లేక ప్రస్తుతం విద్యార్థుల దరఖాస్తులు అంతంత మాత్రంగా వచ్చాయి. అవగాహన ఉంటే అవకాశాలు మెండుగా ఉంటాయి.

8లో

క్రేన్ ఢీకొని యువకుడి మృతి

బోల్తా పడిన లారీని పైకి లేపుతుండగా ప్రమాదవశాత్తూ క్రేన్ ఢీకొనడంతో ఓ యువకుడికి తీవ్ర గాయాలై మృతి చెందాడు. ఈ విషాద ఘటన నిడదవోలు మండలం పందలపర్రులో చోటుచేసుకుంది. సమిశ్రగూడెం ఎస్సై రమేష్ కథనం ప్రకారం..

న్యూస్‌రీల్

ఎగువన పెరుగుతున్న గోదావరి


ధవళేశ్వరం: గోదావరి పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ఎగువ ప్రాంతాల్లో నీటి మట్టాలు పెరుగుతున్నాయి. ఈ ప్రభావంతో మంగళవారం ధవళేశ్వరం వద్ద నీటి ఉధృతి పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో మిగులు జలాలను ఎప్పటికప్పుడు దిగువకు వదులుతున్నారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు కాటన్ బ్యారేజ్ వద్ద 7 అడుగులకు నీటి మట్టం చేరింది. బ్యారేజ్ నుంచి 3,72,932 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. స్థానికంగా వర్షాలు కురుస్తుండటంతో డెల్టా కాలువలకు నీటి విడుదల తగ్గించారు. తూర్పు, మధ్య డెల్టా కాలువలకు 1000 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఇందులో తూర్పు డెల్టాకు 500, మధ్య డెల్టాకు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. పశ్చిమ డెల్టాకు నీటి విడుదలను పూర్తిగా నిలిపివేశారు.

విఘ్నేశ్వరుని ఆదాయం రూ.2,70,336
అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయానికి సోమవారం ఒక్కరోజు వివిధ పూజల ద్వారా రూ.2,70,336 ఆదాయం లభించిందని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణ రాజు తెలిపారు. అదేవిధంగా స్వామివారి పంచామృతాభిషేకాల్లో ఒక జంట, శ్రీలక్ష్మీ గణపతి హోమంలో 33 మంది దంపతులు, లఘున్యాస అభిషేకాల్లో 93 మంది పాల్గొన్నారు. 3,100 మంది స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో ప్రతిభ

రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో విజేతలైన అమలాపురం విక్టరీ అకాడమీ విద్యార్థులతో ఆ అకాడమీ ప్రతినిధులు

అమలాపురం టౌన్: రాజమహేంద్రవరం బీఏన్కేయూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆ నగరంలోని వీఎంవీఏ హాలులో ఆదివారం రాత్రి జరిగిన రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో అమలాపురం విక్టరీ అకాడమీకి చెందిన నలుగురు విద్యార్థులు ప్రతిభ చాటారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి ఈ పోటీలకు దాదాపు 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ పోటీల్లో ఓపెన్ కేటగిరీకి సంబంధించి అమలాపురం అకాడమీకి చెందిన ద్రాక్షారపు సాత్విక్ తృతీయ స్థానం సాధించి రూ.5 వేల నగదు బహుమతి కైవసం చేసుకున్నాడని అకాడమీ చైర్మన్, జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి తాడి వెంకట సురేష్ తెలిపారు. ఇదే పోటీల అండర్- 13 విభాగంలో అకాడమీకి తాడి వెంకటేష్ ప్రథమ స్థానంతో రూ.5 వేల నగదు బహుమతి, అండర్-15 విభాగంలో అరిగెల జయ ప్రకాష్ ద్వితీయ స్థానం, బందారు నాని బాబు తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలను రాష్ట్ర చెస్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

అయోమయ పాలసీ

ఇసుక ఉచితం పేరుకే!
- 11 నుంచి తెరుచుకోనున్న 9 ర్యాంపులు
- ఇసుక దొరక్క నిలిచిన నిర్మాణాలు
- భవన నిర్మాణ కార్మికుల ఉపాధికి గండి
- దోపిడీకి అడ్డాగా స్టాక్ పాయింట్లు
- ధర నిర్ణయంలో స్పష్టత కరవు


ఔరంగాబాద్ ఇసుక ర్యాంపులో ఇసుక నిల్వలు


నిడదవోలు మండలం పందలపర్రు ఆర్బీకే వద్ద ఇసుక బుకింగ్ కోసం వచ్చిన ప్రజలు

కొవ్వూరు: ఉచితంగా ఇసుక అందిస్తామంటూ గొప్పలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ హామీని విస్మరించింది. అధికారం చేపట్టి వంద రోజులు కావస్తోంది. జూన్ ఒకటో తేదీన మూతపడిన ఇసుక ర్యాంపులను ఇంత వరకు తెరకపోవడంతో జిల్లాలో ఇసుకకు తీవ్ర కొరత ఏర్పడింది. సామాన్యులకు ఇసుక దొరకడమే గగనంగా మారింది. ఇసుక కొరత నేపథ్యంలో జిల్లాలో భవన నిర్మాణ పనులు మందగించాయి. ఫలితంగా వేలాది భవన నిర్మాణ కార్మికులు పనులు దొరక్క ఇబ్బంది పడుతున్నారు. గడిచిన వంద రోజుల్లో గోదావరికి వరద వచ్చిన పది రోజులను మినహాయిస్తే మిగిలిన రోజుల్లో ఇసుక తవ్వకాలకు అనువుగానే ఉంది. అనుమతులు, కొత్త మార్గదర్శకాల రూపకల్పన పేరుతో ఇన్నాళ్లూ కాలక్షేపం చేశారు. ఈ నెల 11 నుంచి ఎట్టకేలకు జిల్లాలో తొమ్మిది ఇసుక ర్యాంపులను తెరిచేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. కొవ్వూరు డివిజన్ పరిధిలో వాడపల్లి, ఔరంగాబాద్-1, కొవ్వూరు, దండగుండరేవు, ఎరినమ్మ, ఔరంగాబాద్-2 ర్యాంపులతో పాటు రాజమహేంద్రవరం డివిజన్‌లో ధవళేశ్వరం, కోటిలింగాలరేవు, రాజమహేంద్రవరం ఒక ర్యాంపును తెరవనున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి ప్రకటించారు. వచ్చేనెల 15 నుంచి ఇసుక పాలసీకి కొత్త మార్గదర్శకాలు రానుండడంతో, అంత వరకు వీటిని తెరుస్తున్నట్లు చెబుతున్నారు.

తొమ్మిది చోట్ల అనుమతి

జిల్లా వ్యాప్తంగా మే నెలలో 24 బోట్స్‌మెన్ ర్యాంపులు నడిచేవి. వీటితో పాటు మరో 14 ఓపెన్ రీచ్‌లు ఉండేవి. వీటిలో ఇప్పుడు గోదావరి వరద నీరు ఉన్న దృష్ట్యా ఓపెన్ ర్యాంపులు తెరిచే అవకాశం లేదు. పడవల ర్యాంపులు మాత్రం తెరిచే అవకాశం ఉన్నప్పటికీ కొన్నింటికే అనుమతి ఇవ్వడంతో పడవల యాజమానులు, కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాళ్లపూడి మండలంలో తాడిపూడి రెండు, ప్రక్కిలంక, తాళ్లపూడిలో రెండు, వేగేశ్వరపురం ర్యాంపులు ఉన్నాయి. కొవ్వూరు మండలంలో ఆరికిరేవుల-1, ఆరికి రేవుల-2, దండగుండరేవుల-1, 2 ర్యాంపులు ఉన్నాయి. రాజమహేంద్రవరంలో గాయత్రీ కాతేరు పేరుతో తొమ్మిది చొప్పున ర్యాంపులున్నాయి. వీటిలో కేవలం తొమ్మిది మాత్రమే తెరవనున్నారు.

ధర నిర్ణయంలో స్పష్టత కరవు

బోట్స్‌మెన్ ర్యాంపుల్లో గత ప్రభుత్వంలో టన్నుకు రూ.200 చొప్పున చెల్లించేవారు. ఇప్పుడు ఎంత చెల్లిస్తారన్న దానిపై స్పష్టత లేదు. 11వ తేదీన తెరవనున్న తొమ్మిది ర్యాంపులు బోట్స్‌మెన్ సొసైటీల ఆధ్వర్యంలో నడిచేవే. ఈ ర్యాంపులకు బోట్స్‌మెన్ సొసైటీల నుంచి ఎంత ధరకి సరఫరా చేస్తారనే అంశంపై కమిట్‌మెంట్ లెటర్స్ తీసుకున్నారు. ఇప్పటి వరకు నడుస్తున్న బోట్స్‌మెన్ సొసైటీల్లో కొన్ని కో-ఆపరేటివ్ సొసైటీలు కాగా మరికొన్ని నాన్ కో-ఆపరేటివ్ సొసైటీలుగా నడిచాయి. మూడేళ్ల పాటు ఆడిట్ పూర్తి చేసుకున్న సొసైటీలను మాత్రమే ఇప్పుడు పరిగణనలోకి తీసుకుంటున్నారు. దీంతో చాలా సొసైటీలకు ఇబ్బంది కానుంది. సొసైటీల నుంచి కుడా ధర నిర్ణయంపై అంగీకార పత్రాలు స్వీకరించారు. బోట్స్‌మెన్స్ ర్యాంపుల్లో సుమారు పదేళ్ల నుంచి టన్నుకు రూ.200 చొప్పున చెల్లిస్తున్నారు. దీనిలో పడవ యజమాని టన్నుకి రూ.165 నుంచి రూ.170 వరకు కూలీలకు, డీజిల్ ఖర్చులు కింద వెచ్చించాల్సి ఉంటుంది. మిలిగిన మొత్తంలో యూనిట్‌కు అంటే నాలుగు టన్నులకు రూ.100 చొప్పున లోడింగ్ నిమిత్తం ఖర్చు చేయాల్సి ఉంటుంది. దీంతో పెరిగిన ధరలను, పెట్టుబడులను దృష్టిలో ఉంచుకుని టన్నుకి రూ.225 నుంచి రూ.250 ఇస్తే తప్ప గిట్టుబాటు అయ్యే పరిస్థితి లేదని పడవల నిర్వాహకులు వాపోతున్నారు.


స్టాక్ పాయింట్లలో దళారుల దందా

జిల్లాలో నిడదవోలు మండలం పందలపర్రు, పెండ్యాలలో ఇసుక స్టాకు యార్డులు నడుస్తున్నాయి. ఇక్కడ టన్ను ఇసుక ధర రూ.270 నిర్ణయించారు. ఇసుక అవసరమైన వారంతా స్థానిక సచివాలయాల్లో ముందస్తుగా బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇది కొందరికి వరంగా మారింది. ఇరవై టన్నుల ఇసుకకు రూ.5,400 చెల్లించాల్సి ఉండగా పదిటైర్ల లారీకి రూ.3 వేలు, రూ.2 వేలు చొప్పున దళారులు దండుకుంటున్నారు. స్థానికంగా ఇసుక ర్యాంపుల్లో పనిచేసిన కూలీలు కొందరు క్యూలైన్లలో నిలబడి ముందస్తుగా బుకింగ్ చేసుకుని లారీ వాళ్లకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో ఇసుక ధర రెండు, మూడు వేల అదనంగా చెల్లించాల్సి వస్తుందని లారీ యాజమానులు చెప్తున్నారు. రెండు, మూడు రోజులు నిరీక్షిస్తే తప్ప ఇక్కడ ఇసుక దొరకడం గగనమవుతోంది. దీంతో లారీ యాజమానులు బుకింగ్ కోసం అదనంగా చెల్లించే సొమ్ములతో పాటు వెయింటింగ్ రోజుల్లో అయిన ఖర్చుల భారం అంతా వినియోగదారులపై రుద్దుతున్నారు. దీంతో మార్కెట్‌లో ఇసుక ధర రెట్టింపు అవుతోంది.

బకాయిలు అందక అవస్థలు

జూలై మూడో వారంలో బోట్స్‌మెన్ ఇసుక ర్యాంపుల్లో ఉన్న నిల్వలు తరలించారు. జూలై 16 నుంచి 21 వరకు సుమారు ఇరవై ఐదువేల టన్నుల ఇసుక నిల్వలు తరలించారు. ఈ మేరకు టన్నుకి వినియోగదారుడి నుంచి రూ.410 చొప్పున ప్రత్యేకంగా రూపొందించిన మెన్స్ యూపీఐ ఐడీకి ఫోన్ చేయించుకుని వసూలు చేశారు. సుమారు రూ.కోటి విలువైన సొమ్ము ప్రభుత్వ ఖాతాకి జమ అయ్యింది. దీనిలో ఇసుక గుట్ట యజమానికి టన్నుకు రూ.150 చొప్పున చెల్లిస్తానని అధికారులు చెప్పారు. ఇప్పటి వరకు యాభై రోజుల పైనే అవుతుంది. జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు బకాయిలు రావాల్సి ఉందని పడవల యజమానులు వాపోతున్నారు. ఈ బకాయిల విషయంపై ఏ ఒక్క అధికారి కనీసం నోరు మెదపడం లేదు. మైన్స్ ఏడీ సుబ్రహ్మణ్యంను సాక్షి వివరణ కోరగా లెక్కలు చూడాలని చెబుతున్నారు. ఎప్పుడు ఇస్తారన్న విషయం కూడా స్పష్టంగా చెప్పడం లేదు.

ఏలేరుకు పోటెత్తుతున్న వరద
- దిగువకు 21,500 క్యూసెక్కుల విడుదల
- 86.08 మీటర్లకు చేరిన నీరు



ఏలేశ్వరం: ఎగువన కురుస్తున్న వర్షాలకు ఏలేరు జలాశయానికి వరదనీరు పోటెత్తుతోంది. ప్రాజెక్టు సామర్థ్య స్థాయికి నీటి నిల్వలు చేరుకున్నాయి. దీంతో దిగువప్రాంతాలకు 21,500 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఎగువప్రాంతం నుంచి 45,355 క్యూసెక్కుల వరద నీరు వచ్చిచేరడంతో ప్రాజెక్టులో 86.56 మీటర్లకు 86.08 మీటర్లు, 24.11 టీఎంసీలకు 23.13 టీఎంసీలకు నీటినిల్వలు చేరుకున్నాయి. గతంలో 2007 అక్టోబర్ 6న గరిష్టస్థాయిలో 86.56 మీటర్లకు 86.56 మీటర్లు, 24.11 టీఎంసీలకు 24.11 టీఎంసీలకు నీటినిల్వలు చేరాయి. దీంతో ఎగువ నుంచి 42 వేల క్యూసెక్కుల వరదనీరు మొత్తాన్ని దిగువకు వదిలారు. అలాగే 2012 నవంబర్ 4న ఎగువ ప్రాంతం నుంచి 30 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరగా 86.56 మీటర్లకు 85.39 మీటర్లు, 24.11 టీఎంసీలకు 21.74 టీఎంసీలకు నీటినిల్వలు చేరగా 30 వేల క్యూసెక్కులను దిగువకు వదిలివేశారు. ప్రస్తుతం దిగువ ప్రాంతానికి ప్రాజెక్టు 5 గేట్ల నుంచి నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో పాటు విశాఖకు 275 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు

జిల్లా అటవీ శాఖ అధికారి భరణి

రాజానగరం: చిరుతపులి సంచారంపై సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, కల్పితాలు ప్రచారం చేస్తున్నారని, ఇటువంటి వారిని గుర్తించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా అటవీ శాఖ అధికారి భరణి హెచ్చరించారు. ఈ మేరకు ఆమె సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. లాలాచెరువు, దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్టు ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలతో నిఘాపెట్టి, పులిని పట్టుకునేందుకు నిర్విరామంగా కృషి చేస్తుంటే ప్రజలను భయాందోళనలకు గురిచేసేలా తప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు. నామవరం శాటిలైట్ సిటీలోని సి-బ్లాక్ 11వ వీధిలో చిరుతపులి కనిపించిందని కొందరు ఆకతాయిలు ఫేక్ ఫొటోలతో వాట్సప్, ఇతర సోషల్ మీడియాలో పోస్టు చేశారన్నారు. దీనితో తెల్లవారుజాము నుంచి ఆ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టామని, అయితే అది అంతా కల్పితమని తెలిసిందన్నారు. ఇందుకు కారకులైన యువకులను పోలీసులు ఆధీనంలోకి తీసుకున్నారన్నారు.

దివాన్‌చెరువు ఫారెస్టులో ఉంది

చిరుతపులి దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్టులోనే ఉందని, తాము అమర్చిన ట్రాప్ కెమెరాలో దానిని గుర్తించామని భరణి తెలిపారు. దానికి పట్టుకునేందుకు బోన్లు ఏర్పాటుచేశామన్నారు. ఈ ప్రాంతాల వారు, ఈ ప్రాంతం మీదుగా ప్రయాణించే వారు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు.



రిజర్వు ఫారెస్టు ప్రాంతంలోని ట్రాప్ కెమెరాలో రికార్డైన చిరుతపులి

అప్రమత్తంగా ఉండండి : ఎస్పీ నరసింహ కిశోర్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం చుట్టుపక్కల పరిసర ప్రాంతాల్లో చిరుత సంచారంపై అసత్య ప్రచారాలు, వదంతులు నమ్మవద్దని ఎస్పీ డి.నరసింహ కిశోర్ చెప్పారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సోషల్ మీడియాలో ఫేక్ వార్తలు పోస్ట్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అవన్నీ శాంతి భద్రతల పరిధిలోకి వస్తాయని, ఇందుకు గ్రూప్ అడ్మిన్‌లే బాధ్యులవుతారని ఎస్పీ హెచ్చరించారు. జిల్లా పోలీసులు రాత్రి వేళ ముమ్మరంగా గస్తీ తిరుగుతున్నారని, ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఆటోల ద్వారా పబ్లిక్ అడ్రెస్సింగ్ సిస్టంతో అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు. ఇళ్ల ముందు విద్యుత్ దీపాలు ఉంచాలని, రాత్రుళ్లు చీకటి ప్రాంతాలకు వెళ్లవద్దని సూచించారు. చిన్నపిల్లలను ఆరుబయట వదలవద్దని, పశువుల పాకలలో ఎవరు ఒంటరిగా నిద్రించవద్దన్నారు. రిజర్వ్ ఫారెస్ట్ ప్రదేశాలైన శ్రీరాంపురం, కవల గొయ్య, పిడింగొయ్యి, స్వరూప్ నగర్, బత్తిన నగర్, లాలాచెరువు, హౌసింగ్ బోర్డ్, పుష్కర వనం, ఆటోనగర్, దివాన్ చెరువు, రఘునాథపురం చుట్టుపక్కల ప్రదేశాలలో నివసించే ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో 112కు కాల్ చేసి జిల్లా పోలీసు సహాయం పొందవచ్చని చెప్పారు.

'క్రిటికల్ కేర్' నిర్మాణాన్ని వేగవంతం చేయండి
- పడకలను 350 నుంచి 635కు పెంచాలి
- జీజీహెచ్ అధికారులతో కలెక్టర్ సమీక్ష


వైద్యశాఖ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటికి క్రిటికల్ కేర్ విభాగం భవన నిర్మాణాన్ని పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ పి.ప్రశాంతి వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వైద్య కళాశాల భవన నిర్మాణాల పురోగతి, వైద్య విద్యార్థులకు వసతులు, ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై ఆమె సమీక్షించారు. ఆసుపత్రిలో బెడ్‌లను 350 నుంచి 635కు పెంచి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. వైద్య కళాశాలకు సంబంధించి నిర్మాణ దశలో ఉన్న భవనాలను వేగంగా పూర్తిచేసి అందించాలని ఆదేశించారు. ఆసుపత్రిలో అదనపు సౌకర్యాల కల్పనకు, అదనపు షెడ్ల నిర్మాణాలకు ప్రతిపాదించగా ఆమోదించినట్టు తెలిపారు. జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీ, అత్యవసర రోగుల బెడ్లు, జీజీహెచ్ ఎమర్జెన్సీ బ్లాక్, ఎంసీహెచ్ భవనం మూడు నాలుగు అంతస్తుల నిర్మాణం తదితర నిర్మాణాలను అందుబాటులోకి తెచ్చేలా ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. బాలుర, బాలికల వసతి వసతి గృహ భవన నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. డీఎంహెచ్ఓ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఎన్.వసుంధర, సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ, ఎన్టీఆర్ వైద్య కో ఆర్డినేటర్ డాక్టర్ పి.ప్రియాంక, ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి విధుల్లో నిబద్ధతగా ఉండాలి : కలెక్టర్



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: క్షేత్రస్థాయి సిబ్బంది నిబద్ధతతో ఉండాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. అధిక వర్షాలు, ముందస్తు జాగ్రత్తలు తదితర అంశాలపై ఆమె సోమవారం కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. జేసీ ఎస్ చిన్న రాముడు, డీఆర్ఓ జి.నరసింహులు ఇతర అధికారులతో నిర్వహించిన సమావేశంలో గ్రామస్థాయిలో చెరువుల నిర్వహణ, గండ్లు పడేందుకు అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి నివేదించాలన్నారు. ఇరిగేషన్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలోని చెరువు గట్ల యదార్థ స్థితి, వాటికి గండ్లు పడే అవకాశంపై వివరాలు అందచేయాలన్నారు. అలాగే ముంపునకు గురయ్యే ఇళ్లు, అక్కడి వారిని సురక్షిత కేంద్రాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. మండల స్థాయి పునరావాస కేంద్రాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. గోపాలపురం దేవరపల్లి, నల్లజర్ల, సీతానగరం, పెరవలి, నిడదవోలు తదితర మండలాల తహసీల్దార్లతో క్షేత్రస్థాయి పరిస్థితులపై కలెక్టర్ ఆరా తీశారు.

అకిరా మియావాకీ మొక్కలు నాటండి

ఉపాధి హామీ సంబంధించి అకిరా మియావాకీ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టి ప్రతి మండలంలో ఐదు నుంచి పది వరకు ప్రదేశాలను గుర్తించాలన్నారు. కనీసం 25 సెంట్ల స్థలాన్ని ఈ మొక్కల పెంపకానికి గుర్తించాల్సి ఉందన్నారు. జిల్లాలో 2570 హెక్టార్లలో హార్టికల్చర్ సాగు చేపట్టాల్సి ఉండగా, 540 హెక్టార్ల విస్తీర్ణంలో రైతులను గుర్తించినట్టు తెలిపారు.

మళ్లీ ముంచేసింది

- 56 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం
- రెండో విడత ముంచెత్తడంతో అన్నదాతల ఆందోళన


రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం కోలమూరులో ముంపు రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మాధవరావు, శాస్త్రవేత్తలు

కొవ్వూరు: గత నెలలో భారీ వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇప్పుడు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురిసిన భారీ వర్షాల వల్ల మరోసారి అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. రెండోసారి వరద ముంచెత్తడంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా చినుకులు పడుతూనే ఉన్నాయి. సోమవారం మధ్యాహ్నం నాలుగు గంటలకు గడిచిన ఇరవై నాలుగు గంటల వ్యవధిలో జిల్లాలో సరాసరి 36 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో ఏడు మండలాల పరిధిలో 2,717.58 హెక్టార్లలో పంటలు ముంపుబారిన పడినట్లు వ్యవసాయ శాఖ అధికారులు గుర్తించారు. దీనిలో కోరుకొండ మండలంలో గరిష్టంగా 12 గ్రామాల పరిధిలో 1,200 హెక్టార్లు, గోకవరం పరిధిలో ఐదు గ్రామాల్లో 620, సీతానగరంలో 15 గ్రామాల పరిధిలో 820 హెక్టార్ల చొప్పున ముంపు బారిన పడ్డాయి. రాజమహేంద్రవరం రూరల్, నిడదవోలు, కడియం, రాజానగరం మండలాల్లో వర్షం వల్ల పంటలు ముంపుబారిన పడ్డాయి. ఉద్యాన శాఖ పరిధిలో అరటి, కూరగాయల పంటలకు 56 హెక్టార్లలో నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. గోకవరంలో గరిష్టంగా 61.0 మిల్లీ మీటర్లు వర్షం కురిసింది. గోపాలపురంలో 36.8, దేవరపల్లిలో 35.0, కోరుకొండలో 34.6, రాజానగరంలో 40.8, సీతానగరంలో 36.0, రాజమహేంద్రవరం అర్బన్‌లో 32.8, రూరల్‌లో 31.2, బిక్కవోలు 18.8, చాగల్లులో 28.2, నిడదవోలులో 30.0, నల్లజర్లలో 27.8, పెరవలిలో 25.2, కడియంలో 27.2, అనపర్తిలో 26.2, ఉండ్రాజవరంలో 27.6, తాళ్లపూడిలో 31.0, కొవ్వూరులో 22.8 మిల్లీ మీటర్లు చొప్పున వర్షం కురిసింది.

ప్రమాదకర స్థాయిలో ఎర్రకాలువ..

ఎర్రకాలువ ప్రమాద స్థాయిలో ప్రవహిస్తోంది. ఎగువున కొంగువారిగూడెంలో ఉన్న జలశయం నుంచి 4వేల క్యూసెక్కుల వరదనీటిని దిగువకు విడిచిపెడుతున్నారు. ఇతర కొండవాగులు దిగువ జత కలవడంతో సోమవారం ఎర్రకాలువలో 7,071 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోందని అధికారులు అంచనా వేశారు. నందమూరు ఆక్విడెట్ వద్ద సోమవారం ఉదయం ఆరు గంటలకు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. వరద ఉధృతిని దృష్టిలో ఉంచుకుని నిడదవోలు, నల్లజర్ల మండల అధికారులు అప్రమత్తం అయ్యారు. ముందు జాగ్రత్తగా నిడదవోలు ఐదు ప్రదేశాల్లో పునరావాస కేంద్రాలను సైతం అధికారుల సిద్ధం చేశారు.

పంట నష్టం అందక పరేషాన్
జూలై నెలలో కురిసిన భారీ వర్షాల వల్ల జిల్లా వ్యాప్తంగా 9,845.471 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు లెక్కలు తెల్చారు. ఈ మేరకు సోషల్ అడిట్ ప్రక్రియ పూర్తి చేసి జూలై 12వ తేదీన ప్రభుత్వానికి తుది నివేదిక పంపారు. జిల్లా వ్యాప్తంగా 238 గ్రామాల పరిధిలో 13,567 మంది రైతులు భారీ వర్షాల వల్ల నష్టపోయారు. వ్యవసాయ పంటలకు రూ.15.87 కోట్లు, ఉద్యాన పంటలకు రూ.2.41 కోట్ల మేరకు పంట నష్ట పరిహారం కింద రైతులకు అందాల్సి ఉంది. రెండు నెలలు కావస్తున్నా ఇంత వరకు పరిహారం సొమ్ము విడుదల కాలేదు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏ సీజన్‌లో నష్టం వాటిల్లితే ఆ నెల తిరగకుండానే రైతులకు పరిహారం అందించేది. జూలైలో నష్టాల నుంచి తేరుకుంటున్న తరుణంలో ఇప్పుడు మరోసారి భారీ వర్షాలు రైతుల్ని ఆందోళనకి గురి చేస్తున్నాయి.

గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లాలో గణేశ్ విగ్రహాల నిమజ్జనం ప్రాంతాల్లో పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్టు ఎస్పీ డి.నరసింహకిశోర్ తెలిపారు. జిల్లాలో వినాయక విగ్రహాలు నిమజ్జనం చేసే ప్రదేశాలలో తీసుకుంటున్న భద్రతా ఏర్పాట్లను ఆయన సోమవారం పరిశీలించారు. నిమజ్జన ప్రాంతాల్లో గజ ఈతగాళ్లు, ఫ్లడ్ లైట్లు, లైఫ్ జాకెట్లు, నాటు పడవలు ఉండేటట్టు చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అనంతరం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ జిల్లాలో వినాయక నిమజ్జనాలు జరిగే ప్రతిచోట పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని, భక్తులకు ట్రాఫిక్ పరంగా, శాంతిభద్రతల పరంగా విఘాతం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

నల్లజర్ల: వినాయక నిమజ్జనోత్సవాల్లో అశ్లీల నృత్యాలు ఏర్పాటు చేస్తే నిర్వాహక కమిటీలపై కేసులు నమోదు చేస్తామని ఎస్పీ నరసింహ కిశోర్ హెచ్చరించారు. సోమవారం మధ్యాహ్నం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడారు. పరిమితికి మించి డీజే సౌండ్స్ పెట్టి ఇబ్బంది కలిగించవద్దని, వర్షాల దృష్ట్యా విద్యుదలంకరణల సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాలువల వద్ద విగ్రహాల నిమజ్జన సమయంలో కమిటీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సీఐ శ్రీనివాస్, ఎస్సై హరిబాబు ఉన్నారు. అనంతరం ఘంటావారిగూడెం, చీపురుగూడెం, పోతవరాల్లో పోలీస్ కవాతు నిర్వహించారు.


నిమజ్జనం ఏర్పాట్లపై పోలీసు అధికారులకు సూచనలు ఇస్తున్న జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్

క్లుప్తంగా

శిలాఫలకం ధ్వంసం



నల్లూరులో ధ్వంసం చేసిన శిలాఫలకం

కపిలేశ్వరపురం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మండలంలో ఆవిష్కరించిన శిలాఫలకాల ధ్వంసం పరంపర కొనసాగుతోంది. ఆదివారం రాత్రి సమయంలో నల్లూరులో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో ప్రతిష్ఠించిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. అప్పట్లో ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన సందర్భంగా ఆవిష్కరించిన ఆ శిలాఫలకాన్ని ఛిద్రం చేశారు. గతంలో కేదారిలంకలో సచివాలయ భవన గోడకు ఉన్న శిలాఫలకాన్ని, గ్రామ శివారులో సర్పంచ్ పేరున ఉన్న స్వాగతం బోర్డులను పెకిలించి పడేశారు.

వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి



చిట్టిబాబు మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య, కుటుంబ సభ్యులు

తాళ్లరేవు: మండలంలోని పటవల పంచాయతీ కొత్తూరు గ్రామానికి చెందిన మత్స్యకారుడు గోపి చిట్టిబాబు (53) వేటకు వెళ్లి మృతి చెందినట్లు కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపారు. సోమవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో తుల్యభాగ నదిలోకి వేటకు వెళ్లిన చిట్టిబాబు మధ్యాహ్నానికి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. తుల్యభాగ నదిలో చిట్టిబాబు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబానికి జీవనాధారమైన భర్త అకాల మృతితో అతని భార్య, కుటుంబ సభ్యులు విలపించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ఆటో బోల్తా: ఐదుగురికి గాయాలు

తాళ్లరేవు: జాతీయ రహదారి 216 పటవల పంచాయతీ మట్లపాలెం సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ కథనం ప్రకారం.. మట్లపాలెం సమీపంలో కాకినాడ వైపునకు వెళుతున్న ఆటోకు అకస్మాత్తుగా కుక్క అడ్డురావడంతో దానిని తప్పించబోయే ప్రయత్నంలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కాకినాడ జగన్నాథపురం గ్రామానికి చెందిన వై.మాణిక్యాలరావు, వీర, యానాంకు చెందిన కృష్ణవేణి, మట్లపాలేనికి చెందిన వి.జ్యోతి, ఉప్పలంకకు చెందిన సత్యవేణికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు, పోలీసులు హుటాహుటిన 108 అంబులెన్స్‌లో కాకినాడ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు.

అవగాహన.. అంతంత మాత్రం

- జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షకు కొరవడిన శ్రద్ధ
- ఇంత వరకూ వచ్చిన దరఖాస్తులు 1,466 మాత్రమే
- ఈ నెల 16తో ముగియనున్న గడువు

రాయవరం: అవగాహన ఉంటే అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు.. ఉన్నత విద్యాభ్యాస్యానికి అడుగులు వేయవచ్చు.. అయితే జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షపై చాలా మందికి అవగాహన లేక ప్రస్తుతం విద్యార్థుల దరఖాస్తులు అంతంత మాత్రంగా వచ్చాయి.. తుది గడువు సమీపిస్తున్నా అధికారుల శ్రద్ధ కొరవడడం కూడా ప్రధాన సమస్యగా మారిందని విమర్శలు వస్తున్నాయి. విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు జవహర్ నవోదయ విద్యాలయ సమితి కృషి చేస్తోంది. అక్కడ సీటు వస్తే తమ చిన్నారులకు ఢోకా ఉండదని తల్లిదండ్రుల నమ్మకం. అయితే సీటు రాదనే భావనో, అవగాహన లేకో ప్రస్తుతం చాలా మంది వెనకడుగు వేస్తున్నారు. జవహర్ నవోదయ విద్యాలయ సమితిలో ఆరో తరగతిలో చేరాలంటే ప్రవేశ



ఐదో తరగతి విద్యార్థులు

గత, ఈ ఏడాది జిల్లాల వారీగా వచ్చిన దరఖాస్తులు

జిల్లా	గత ఏడాది	నేటి వరకూ వచ్చిన దరఖాస్తులు
కోనసీమ	3,548	442
తూర్పుగోదావరి	1,521	203
కాకినాడ	3,437	821

పరీక్షే ఆధారం. ఇందులో ప్రతిభ చూపితే సీటు ఖాయం. 2025–26 విద్యా సంవత్సరంలో ఆరో



పెద్దాపురంలో జవహర్ నవోదయ విద్యాలయ

తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఐదో తరగతిలో చదువుతున్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా, ఈ ఏడాది దరఖాస్తుల సంఖ్య అంతంత మాత్రంగానే ఉంది. ఈ నెల 16తో దరఖాస్తుల గడువు ముగియనుంది. పెద్దాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని విద్యార్థులు ఇక్కడ మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకూ ఉచిత విద్యను ఇక్కడ అందిస్తారు. విద్యతో పాటు అధునాతన సౌకర్యాల కల్పన, ప్రయోగాత్మక విద్య, క్రీడలు, క్రమశిక్షణ, ప్రతిభకు పెద్దపీట వేయడం ఈ విద్యా సంస్థల్లో ప్రత్యేకత.

అంతంత మాత్రంగా దరఖాస్తులు

వచ్చే ఏడాది జనవరి 18న నిర్వహించే ప్రవేశ పరీక్షకు మూడు జిల్లాల నుంచి కేవలం 1,466 మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. 2023–24లో 8,779 దరఖాస్తులు రాగా, గతేడాది మూడు జిల్లాల పరిధిలో 8,506 దరఖాస్తులు వచ్చాయి. ఇదిలా ఉంటే ఈ ఏడాది ఇంకా ఎక్కువగా దరఖాస్తులు వస్తాయనే లక్ష్యంతో అధికారులు ఉన్నారు. పెద్దాపురం జవహర్ నవోదయ విద్యాలయాల్లో మొత్తం 80 సీట్లు ఉన్నాయి. ప్రస్తుతం ఆయా మండలాల్లోని ఐదో తరగతి చదువుతున్న బాల బాలికలు అర్హులు. మూడు జిల్లాల్లో ఈ ఏడాది ఐదో తరగతిలో సుమారు 60 వేల మంది విద్యార్థులు ఉన్నారు. 2025–26 విద్యా సంవత్సరంలో నిర్వహించే ప్రవేశ పరీక్షకు హాజరయ్యే బాలబాలికలు 2013 మే ఒకటవ తేదీ నుంచి 2015 జూలై 31 మధ్య జన్మించి ఉండాలి. ప్రభుత్వం గుర్తించిన పాఠశాలల్లో 3, 4 తరగతులు ఉత్తీర్ణత సాధించి ఐదో తరగతి చదువుతున్న వారు మాత్రమే అర్హులు. గతేడాది ప్రవేశ పరీక్షకు హాజరైన వారు అనర్హులు.

పరీక్ష విధానం ఇలా..

నవోదయ ప్రవేశ పరీక్షను 2025 జనవరి 18న ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ మూడు జిల్లాల్లో నిర్దేశించిన పరీక్ష కేంద్రాల్లో నిర్వహిస్తారు. ప్రవేశ పరీక్షను విద్యార్థులు ప్రస్తుతం చదువుతున్న భాషను (తెలుగు/ ఇంగ్లిషు) ఎంచుకుని రాసే వీలుంది. మొత్తం 80 ప్రశ్నలు ఉంటాయి. ఆబ్జెక్టివ్ విధానంలో 100 మార్కులకు నిర్వహించే ప్రవేశ పరీక్ష రాసేందుకు రెండు గంటల సమయాన్ని కేటాయిస్తారు. ఉత్తీర్ణులై ప్రవేశానికి ఎంపికైన వారికి మొదటి రెండేళ్లు తెలుగు/ఇంగ్లిషు భాషల్లో బోధిస్తారు.

బాధ్యతగా తీసుకోవాలి



జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశ పరీక్షకు ప్రతి విద్యార్థి దరఖాస్తు చేయాలి. ఈ నెల 16వ తేదీ దర ఖాస్తుకు తుది గడువు. ప్రవేశ పరీక్ష దరఖాస్తులను మూడు జిల్లాల విద్యాశాఖాధికారుల ద్వారా పాఠశాల లకు పంపించాం. పలు పాఠశాలలకు వెళ్లి అవగాహన కల్పిస్తున్నాం. దరఖాస్తు చేయాలనుకునే ప్రతి విద్యార్థితో ఉపాధ్యాయులు దరఖాస్తు చేయించాలి. దీనిని మరింత బాధ్యతగా తీసుకోవాలి.

–ఎం.కృష్ణయ్య, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, నవోదయ విద్యాలయ, పెద్దాపురం

క్రేన్ ఢీకొని యువకుడి మృతి

- బోల్తాపడిన లారీ తీస్తుండగా ఘటన
- పందలపర్రులో విషాద ఛాయలు



పందలపర్రులో బోల్తా పడిన టిప్పర్ లారీని పైకి తీస్తున్న క్రేన్



అత్తిలి తారక రామకృష్ణ గణేష్ (ఫైల్)

నిడదవోలు రూరల్: బోల్తా పడిన లారీని పైకి లేపుతుండగా ప్రమాదవశాత్తూ క్రేన్ ఢీకొనడంతో ఓ యువకుడికి తీవ్ర గాయాలై మృతి చెందాడు. ఈ విషాద ఘటన నిడదవోలు మండలం పందలపర్రులో చోటుచేసుకుంది. సమిశ్రగూడెం ఎస్సై రమేష్ కథనం ప్రకారం.. పందలపర్రు గ్రామానికి చెందిన అత్తిలి శివగంగారావు కుమారుడు తారక రామకృష్ణ గణేష్ (28)కు రెండు టిప్పర్ లారీలు ఉన్నాయి. ఈ నెల 8వ తేదీ ఆదివారం సాయంత్రం రామకృష్ణ గణేష్‌కు చెందిన టిప్పర్ లారీ ఇసుక లోడ్‌తో వస్తూ పందలపర్రు ర్యాంప్ రోడ్డులో బోల్తా పడింది. దీంతో దానిని రెండు క్రేన్‌ల సహాయంతో పైకి లేపుతుండగా ప్రమాదవశాత్తూ ఒక క్రేన్ హైడ్రోలిక్ మెషీన్ వచ్చి పక్కనే ఉన్న రామకృష్ణ గణేష్ వెనుక వీపు వైపు బలంగా ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో రామకృష్ణ గణేష్‌ను నిడదవోలు తరలించి అక్కడ నుంచి రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మృతి చెందాడు. అత్తిలి మండలం మంచిలికి చెందిన క్రేన్ డ్రైవర్ గుత్తుల ప్రకాష్ నిర్లక్ష్యంతోనే తన కొడుకు మృతి చెందినట్లు తండ్రి శివగంగారావు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రమేష్ తెలిపారు. యువకుడైన రామకృష్ణ గణేష్ మృతితో స్వగ్రామమైన పందలపర్రులో విషాదఛాయలు అలముకున్నాయి. అందరితో ఆప్యాయతగా మాట్లాడే రామకృష్ణ గణేష్ మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులతో పాటు బంధుమిత్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత



సభలో మాట్లాడుతున్న ఉమర్ ఆలీషా

పిఠాపురం: ఆధ్యాత్మిక, తాత్వికజ్ఞానం మానవునికి మంచి, చెడులను విశ్లేషించుకునే శక్తిని ఇస్తుందని పిఠాపురం శ్రీవిశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. పిఠాపురం ఆశ్రమ ప్రాంగణంలో పీఠం సప్తమ పీఠాధిపతి హుస్సేన్‌షా 119వ జయంతిని పురస్కరించుకుని సోమవారం ఏర్పాటు చేసిన సభలో ఆలీషా భక్తులకు అనుగ్రహ భాషణ చేశారు. ఆధ్యాత్మిక చింతనతోనే మానవుడికి మానసిక ప్రశాంత లభిస్తుందని వెల్లడించారు. చిన్నతనం నుంచి ప్రతి వ్యక్తీ తాత్విక జ్ఞానాన్ని అలవరచుకుంటే తన జీవిత కాలమంతా ప్రశాంతంగా జీవనం కొనసాగించవచ్చని అన్నారు. ధ్యాన, జ్ఞాన, మంత్ర సాధనలతో కూడిన త్రయీ సాధనను అలవరచుకోవడం ద్వారా తాత్విక జ్ఞానం తెలియబడుతుందని తెలిపారు. పీఠం సప్తమ పీఠాధిపతి హుస్సేన్ షా రచించిన మహోత్కృష్ట గ్రంథం ×షా తత్వాన్ని ప్రతి ఒక్కరూ చదవాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పీఠం సభ్యులకు పిలుపునిచ్చారు. అనంతరం ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ రోటరీ బ్లడ్ బ్యాంక్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని పీఠాధిపతి ప్రారంభించారు. ట్రస్ట్ ద్వారా అనేక మంది నిరుపేద మహిళలకు కుట్టు మెషీన్లు, పక్షుల ఆహారం కోసం తయారుచేసిన ధాన్యపు కుచ్చులను సభలో పంపిణీ చేశారు. పీఠం ముద్రించిన అనేక గ్రంథాలను ముఖ్య అతిథుల సమక్షంలో ఆలీషా ఆవిష్కరించారు. సభకు ముఖ్య అతిథులుగా హాజరైన జేఎన్టీయూకే వైస్ ఛాన్సిలర్ డాక్టర్ మురళీకృష్ణ, రిజిస్ట్రార్ డాక్టర్ రవీంద్రనాథ్, శతావధాని ఆముదాల మురళి, శ్రీకిరణ్ కంటి ఆసుపత్రి చైర్మన్ పద్మశ్రీ డాక్టర్ చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ మానవులు విశ్వ మానవ శ్రేయస్సే పరమావధిగా శ్రీవిశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం సాగుతుందన్నారు. విజ్ఞాన జ్యోతి గ్రంథాన్ని కన్నడ భాషలోకి అనువదించిన ప్రముఖ కవి, రచయిత, విశ్లేషకుడు జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తిని పీఠాధిపతి సత్కరించారు. అనంతరం కవిశేఖర డాక్టర్ ఉమర్ ఆలీషా సాహితీ సమితి ద్వారా అందిస్తున్న హుస్సేన్ షా కవి స్మారక సాహితీ పురస్కారాన్ని ప్రముఖ సాహితీ వేత్తలు అవధాన ప్రాచార్య డాక్టర్ ధూళిపాళ మహాదేవ మణి, ప్రముఖ పాత్రికేయుడు లంకలపల్లి అశోక్‌లకు సంయుక్తంగా అందజేశారు. పురస్కారంతో పాటు ఒక్కొక్కరికీ రూ.25 వేల నగదు ప్రోత్సాహకాన్ని ఇచ్చారు.

అధికారుల చేతుల్లోనే గ్రామీణ ఆరోగ్యం



శిక్షణలో మాట్లాడుతున్న రాష్ట్ర పీఆర్అండ్ఆర్డీ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణమోహన్

సామర్లకోట: ఆరోగ్యకర గ్రామాల నిర్మాణం జిల్లా స్థాయి అధికారుల చేతుల్లోనే ఉంటుందని, వారు బాధ్యతగా తమ విధులు నిర్వర్తిస్తే అది సాధ్యమవుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ కమిషనర్ ఇ.కృష్ణమోహన్ అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణా కేంద్రం (ఈటీసీ)లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల శిక్షణలో భాగంగా సోమవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణను ఆయన ప్రారంభించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, తూర్పు, పశ్చిమ, ఏలూరు జిల్లాలోని వివిధ శాఖల అధికారులకు 'ఆరోగ్యకరమైన గ్రామం' అనే అంశంపై శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ఆరోగ్యంగా ఉండటం ద్వారా మంచి గ్రామాన్ని తయారు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ మేరకు ప్రజల్లో పోషకాహార లోపాలను గుర్తించడం, కౌమార దశలో ఉన్న బాలికలు, స్త్రీలో రక్తహీనతను తొలగించడం, తక్కువ బరువు కలిగిన పిల్లలను గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ పనులను స్త్రీ, శిశు సంక్షేమ శాఖ చేయాలన్నారు. అంటు వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. మాతాశిశు మరణాలు లేకుండా చేయాలని సూచించారు. ఈ మేరకు ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలల్లో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించే విధంగా చూడాలని తెలిపారు. జాతీయ ఆరోగ్య మిషన్, జాతీయ ఆయుష్ మిషన్, ఐసీడీఎస్ అనుబంధ పథకాలు, ప్రధానమంత్రి మాతృ వందన యోజన, పోషణ్ అభియాన్‌లు పంచాయతీ స్థాయిలో వినియోగించుకోవాలని చెప్పారు. ఫ్యాకల్టీ పి.శ్రీనివాసరావు, కేఎస్ఆర్ నిహారిక, పద్మజ, వి.ప్రసాద్‌లు శిక్షణ ఇచ్చారు.

రేషన్ బియ్యం స్వాధీనం



కడియపులంకలో రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

కడియం: ఓ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు అధికారులు సోమవారం కడియపులంక గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. ఓ టాటా ఏస్ వాహనంలో రూ.3,34,340 విలువైన 2,790 కిలోల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. ఆటో డ్రైవర్ దేవగుప్త కాశీకృష్ణ భగవాన్, వాహన యజమాని, పీడీఎస్ బియ్యం కొనుగోలుదారుడు కడియపులంకకు చెందిన పెన్నాడ రాంబాబులు కడియం పరిసర ప్రాంతాల్లో పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి మండపేటలోని కోళ్ల ఫారమ్‌కు అమ్ముతున్నట్లు విచారణలో తేలింది. ఆ వాహనాన్ని సీజ్ చేసి 6–ఏ కింద కేసు నమోదు చేసి, సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదుకు పోలీస్ స్టేషన్‌కు సిఫారసు చేశారు. రీజినల్ విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాజమహేంద్రవరం రీజినల్ విజిలెన్స్– ఎన్‌ఫోర్స్‌మెంట్ పరిధిలోని మూడు జిల్లాల్లో చౌక బియ్యం అక్రమ నిల్వలు, రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతుందన్నారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు నాగ వెంకటరాజు, నవీన్ కుమార్, కిశోర్, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు పాల్గొన్నారు.

ఒకే కాన్పు.. ముగ్గురు శిశువులు



ముగ్గురు ఆడ శిశువులు

కాకినాడ క్రైం: స్థానిక జీజీహెచ్‌లో ఓ గర్భిణి ఒకే కాన్పులో ముగ్గురు శిశువులకు జన్మనిచ్చింది. ఆ ముగ్గురు ఆడ శిశువులు క్షేమంగానే ఉన్నారని వైద్యులు తెలిపారు. సామర్లకోట మండలం ఉండూరుకు చెందిన సలాది లోవరాజు, మౌనికలకు 2022లో వివాహమైంది. లోవరాజు భవన నిర్మాణ కార్మికుడు. మౌనిక గర్భిణి కావడంతో ప్రసవానికి సోమవారం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఆమె ముగ్గురు ఆడ శిశువులను జన్మనిచ్చింది. శిశువుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండగా, తల్లి కోలుకుంటోందని వైద్యులు తెలిపారు.

అత్యాచారం కేసులో తొమ్మిదేళ్ల జైలు

ఏలేశ్వరం: అత్యాచారం కేసులో మండలంలోని జె.అన్నవరం గ్రామానికి చెందిన పెయ్యల వీరబాబుకు రాజమహేంద్రవరం జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి వై.బెన్నయ్యనాయుడు తొమ్మిదేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధించినట్లు ఎస్సై ఎన్.రామలింగేశ్వరరావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. 2016 జూలై 15న జె.అన్నవరంలో ఓ మానసిక వికలాంగురాలు రాత్రి సమయంలో తోట మణికంఠ ఇంటికి వెళ్లగా అక్కడ ఉన్న పెయ్యల వీరబాబు అత్యాచారం చేశాడు. దీంతో బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై రవికుమార్ కేసు నమోదు చేయగా, సీఐ బి.అప్పారావు దర్యాప్తు చేసి నిందితుడు పెయ్యల వీరబాబును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. వాదోపవాదాల అనంతరం పైవిధంగా తీర్పు చెప్పారు.

వర్షాకాలం... వ్యాధుల గాలం

- విజృంభిస్తున్న విష జ్వరాలు
- ఆసుపత్రుల్లో చేరుతున్న బాధితులు



ఆలమూరు సామాజిక ప్రభుత్వ ఆస్పత్రిలో జ్వరాలతో చికిత్స పొందుతున్న రోగులు

ఆలమూరు: వాతావరణ మార్పులతో అంటువ్యాధులు విజృంభిస్తున్నాయి. ఇంట్లో ఒకరి తరువాత మరొకరికి విష జ్వరాలు సోకుతున్నాయి. ప్రసుతం కురుస్తున్న భారీ వర్షాలు, వరదలు తగ్గుముఖం పట్టిన తరువాత సీజనల్, అంటువ్యాధులు మరింత వ్యాప్తి చెందే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 162 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 12 సామాజిక ఆరోగ్య పోషక కేంద్రాలు, ఏడు ఏరియా ఆస్పత్రులు ఉన్నాయి. ఈ ఆస్పత్రుల్లో ప్రతి రోజూ సరాసరి సుమారు రెండు వేల వరకూ సీజనల్, అంటు వ్యాధుల కేసులు రికార్డుల్లో నమోదవుతున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ గణాంకాలు చెబుతున్నాయి. అలాగే ప్రైవేట్ ఆస్పత్రుల్లో నిత్యం వేలాది మంది చికిత్స తీసుకుంటున్నారు. గత ఆగస్టులో సుమారు 50 వేల కేసులు, ఈ నెలలో ఇప్పటి వరకూ సుమారు 13 వేల కేసులు ఆయా ఆస్పత్రుల్లో నమోదు కాగా వందలాది మంది చికిత్స పొందుతున్నారు. వ్యాధుల నియంత్రణకు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

కలుషిత నీటి వల్లే..

వరదలు, వర్షాలతో పరిసరాల్లో మురుగు నీరు నిల్వ ఉండి తాగునీరు కలుషితం అవుతోంది. తద్వారా అంటువ్యాధులు, సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. వీటివల్ల టైఫాయిడ్, మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. ఆహారపు అలవాట్లు సక్రమంగా లేకపోతే వ్యాధి నిరోధకశక్తి తగ్గిపోయి వ్యాధులకు గురవుతారు. ఈ అంటువ్యాధులు, సీజనల్ వ్యాధులు సుమారు 24 రకాలు ఉన్నాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ప్రతి ఒక్కరూ తాగునీటిని కాచి చల్లార్చిన తర్వాత మాత్రమే తాగాలి.
- ఇంట్లో రోజూ అప్పటికప్పుడు తయారు చేసిన ఆహార పదార్థాలను మాత్రమే భుజించాలి.
- ఆహార పదార్థాలపై క్రిమి కీటకాలు దరిచేరకుండా వంట పాత్రలపై మూతలను ఉంచాలి.
- వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- వంట చేసే ముందు, భోజనం చేసే ముందు, మల విసర్జనకు వెళ్లి వచ్చిన తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలి.
- బయట ప్రదేశంలో వండిన పదార్థాలు కాని, చిరు తిళ్లు (జంక్ ఫుడ్స్)కు వీలైనంత వరకూ దూరంగా ఉండాలి.
- నివాస ప్రాంతాల్లో, పాత టైర్లలో, టెంకాయ చిప్పల్లో, పాత వాటర్ బాటిల్స్‌లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.
- వైద్య ఆరోగ్యశాఖ ప్రతి శుక్రవారం నిర్వహించే ఫ్రైడే డ్రైడే కార్యక్రమం ద్వారా అందించే సూచనలు, సలహాలను తప్పనిసరిగా పాటించాలి.
- ఇంట్లోకి దోమలు ప్రవేశించకుండా రక్షణ చర్యలు తీసుకోవాలి.



జొన్నాడలో పారిశుధ్య పనులు చేయిస్తున్న అధికారులు



మూలస్థాన అగ్రహారంలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమం

వ్యాధి	లక్షణాలు
మలేరియా	చలి, జ్వరం, తలనొప్పి, జలుబు, దగ్గు, వాంతులు
డయేరియా	వికారం, కడుపు నొప్పి, విరేచనాలు
టైఫాయిడ్	జ్వరం, నీరసం, కడుపు నొప్పి
కలరా	నీళ్ల విరేచనాలు, వాంతులు, కాళ్లు లాగడం
డెంగీ	హఠాత్తుగా జ్వరం రావడం, భరించలేని తలనొప్పి, కీళ్ల నొప్పులు, ఆకలి మందగించడం, వాంతులు
కామెర్లు	జ్వరం, అలసట, తలనొప్పి, మూత్రం పచ్చగా రావడం, కళ్లు పచ్చబడటం, వికారం

అప్రమత్తంగా ఉండాలి



వాతావరణంలో సంభవిస్తున్న మార్పులతో సీజనల్ వ్యాధులు సంభవిస్తున్నాయి. అనారోగ్యానికి గురైనప్పుడు సత్వరమే సమీప ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చికిత్స పొందాలి. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వ్యాధులకు సంబంధించి ఔషధాలు పుష్కలంగా ఉన్నాయి. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

–కె.దుర్గారావు దొర, డీఎంహెచ్‌ఓ, కోనసీమ జిల్లా